ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 22 | సంచిక : 4 | డిసెంబర్ 2016

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

23-09-1984
జిన్నూరు

23-09-2016
అరుణాచలం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-1984, జిన్నూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ ఆదివారం సమావేశాలు ప్రత్యేకంగా ఒక ఉద్దేశ్యంతో కాని, ఒక ప్రణాళికాబద్ధంగా కాని ఏర్పాటుచేయబడలేదు. మొదట్లో వడ్లవాని పాలెం రామచంద్రరాజుగారు ప్రతీ ఆదివారం మా ఇంటికి వచ్చి కూర్చునే వారు. రామచంద్రరాజుగారు చాలా శ్రద్ధగా, భక్తిగా వస్తున్నారని నేను కూడా ఆ టైముకు ఇంటిదగ్గరే ఉండి ఏదో నాకు తోచింది చెప్పేవాడిని. రామచంద్రరాజుగారు వస్తున్నారని చింతపర్రు నుండి అప్పలరాజుగారు, కాపవరం నుండి సూర్యనారాయణరాజుగారు కూడా రావటం ప్రారంభించారు. తరువాత కొంతమంది ఊళ్ళో భక్తులు కూడా రావటం ప్రారంభించారు. మా ఇంటిదగ్గర సుమారు 5 - 6 నెలలు ఈ సమావేశాలు జరిగాయి. తరువాత ఇక్కడ పోస్టాఫీసు దగ్గర ప్రారంభించారు. మొదట్లో ఒక పదిమంది ఇక్కడ గదిలో కూర్చొనే వాళ్ళము. తరువాత పందిరి వెయ్యటం, ఈ సమావేశాలు ఏర్పాటు చేయటం జరిగింది. అంతేగాని ఇక్కడ ఒక పర్పస్‌గా ఏదో బోధ చేద్దామని అలా ఏర్పాటుచేయలేదు.

తరువాత ఈ రోజు నా జన్మదినం అని కూడా ఇక్కడ నాలుగు మాటలు చెప్పారు. నా శరీరం కొమ్మరలో జన్మించింది. నా శరీరానికి 50 సంవత్సరాలు వచ్చాయి. అంటే 50సంవత్సరాలకు పూర్వం మనంలేమని కాదు. ఈ శరీరానికి 50 సంవత్సరాలు అంతే. అయితే నేను మటుకు నావయస్సు పాతిక సంవత్సరాలే అనుకొంటున్నాను. ఇదేమిటి నాకు లెక్క తెలియటంలేదా అంటే నాకు భగవాన్‌తో పరిచయం అయ్యి ఇంచుమించు పాతిక సంవత్సరాలు. భగవాన్ నన్ను ఆశీర్వదించి, తన యొక్క ఫోల్డ్‌లోకి తీసుకొని పాతిక

సంవత్సరాలు అయ్యింది. అలాగ నా 50 సంవత్సరాల జీవితంలో ఒక పాతిక సంవత్సరాలు తీసేస్తే, ఇంకో పాతిక సంవత్సరాలే లెక్కలోకి తీసుకోవచ్చు. జన్మ అంటే ఈ శరీరం జన్మించటం జన్మకాదు, ఈ శరీరం మరణించటం మరణం కాదు. ఇది మీరు బాగా అర్థం చేసుకోండి. ఈ ఒక్క వాక్యం మీకు అర్థమయితే ఈ రోజుకు సరిపోతుంది. మరి మనకు జన్మ ఎప్పుడు అంటే ఎప్పుడైతే అహంకారం పుట్టిందో అప్పుడు మనకు జన్మ వచ్చింది, ఎప్పుడు అయితే అహంకారం పోయిందో ఆ రోజున మరణించినట్లు. శరీరం పుట్టినప్పుడు నేను పుట్టాను అనేది అబద్ధం. అహంకారం పుట్టినప్పడే మనిషి పుడతాడు. శరీరానికి వచ్చిన జన్మ జన్మకాదు. శరీరానికి వచ్చిన మరణం మరణం కాదు. అహంకారానికి వచ్చిన జన్మే జన్మ, అహంకారానికి వచ్చిన మరణమే మరణం.

ఆచార్యులవారు ఏమన్నారు అంటే ఎవరయినా మరణిస్తే మనం విలపించనక్కరలేదు అని చెప్పారు. ఎందుచేతనంటే మరణించినవాడు తిరిగి జన్మిస్తాడు, తిరిగి జన్మించేవాడి గురించి ఏడవటం ఎందుకు అన్నారు. అందుచేత శరీరం మరణించటం కాదు, అహంకారం మరణించాలి. అహంకారం మరణిస్తే వాడు మరణించినట్లు లెక్క. అహంకారం మరణించలేదు అనుకోండి, శరీరం మరణించింది అనుకోండి వాడికి తిరిగి శరీరం వస్తుంది కాబట్టి అది ఇంకా వాడికి మరణం కింద లెక్క కాదు. ఇందులో ఒక చిన్నరహస్యం ఉంది. మనలో ఉన్న నిజమైన ఆత్మకు శరీరం అక్కరలేదు. మనలో ఉన్న అహంకారానికే శరీరం కావాలి. అందుచేత అది మరణించేవరకూ శరీరాలు వస్తూనే ఉంటాయి. ఇది మీకు అర్థం అవ్వాలి. చీర చిరిగిపోతే మనం కొత్తచీర కొనుక్కొంటాము. చీర కట్టే వాళ్ళం మనం ఉన్నాము కాబట్టి కొత్త చీర కొనుక్కొంటాము. అలాగే అహంకారం ఉన్నంతకాలం ఒకవేళ ఈ శరీరం ముసలిదైపోయి, శిథిలమైపోయింది అనుకోండి అహంకారం దీనిని వదిలేసి కొత్త శరీరాన్ని తీసుకొంటుంది. చీర పోయిన తరువాత కొత్తచీర ఎలా కొనుక్కొంటున్నామో అలాగే ఈ శరీరం పోయిన తరువాత అహంకారానికి ఏదో ఒక శరీరం ఉండి తీరాలి కాబట్టి కొత్త శరీరాన్ని తీసుకొంటుంది. అహంకారం ఒక శరీరాన్ని ఆశ్రయించి పుడుతుంది, ఒక శరీరాన్ని ఆశ్రయించి పెరుగుతుంది, శరీరం చనిపోయేటప్పుడు కూడా అది ఒక శరీరాన్ని స్మరిస్తూనే పోతుంది. మీరు మరణించే టప్పుడు మీకు ఇష్టమైన శరీరాలే జ్ఞాపకం వస్తాయి, ఆ శరీరాలను స్మరిస్తూనే మరణిస్తారు.

అహంకారానికి ఎంతసేపు రూపదృష్టి కావాలి రూపం లేకపోతే అహంకారం నిలబడదు. అందుచేత రూపాలు మారుస్తూ ఉంటుంది. నామరూపాలు మారుతూ ఉంటాయి, ఆలోచనలు మారుతూ ఉంటాయి, అభిరుచులు, ఆశయాలు, ఆకాంక్షలు మారుతూ ఉంటాయి కాని మూలంలో ఉన్న రోగం మటుకు అలాగే ఉంటుంది. అహంకారం

ఏదో రూపాన్ని ఆధారంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటుంది. ఒంటరిగా ఉండే శక్తి దానికి లేదు. చిన్నప్పుడు తల్లిని ప్రేమిస్తుంది, వయస్సువచ్చిన తరువాత భార్యని ప్రేమిస్తుంది, ఇంకా కొంత వయస్సు వచ్చాక మనవలను ప్రేమిస్తుంది, లేకపోతే డబ్బును ప్రేమిస్తుంది, లేకపోతే చదువును ప్రేమిస్తుంది. ఇలా ఏదో ఒకదానిని ఆధారంగా పెట్టుకొనే అది ఉంటుంది కాని స్వతంత్రంగా ఉండే శక్తి అహంకారానికి లేదు. మీ ఇంట్లో ఎవరూ మీతో మాట్లాడటం లేదు అనుకోండి, మీకు ఎంతో కంగారు వస్తుంది, దుఃఖం వస్తుంది. ఆ దుఃఖపడేది అహంకారం, దానికి ఏదోఒక రూపం యొక్క ఆధారం ఉండాలి. మీ ఇంట్లో అందరూ మిమ్మల్ని పలకరించటం మానేసారు అనుకోండి. మీరు ఉండగలరా? అయ్యబాబోయ్ నాతో ఎవరూ మాట్లాడటంలేదు ఏమిటి అని మీకు భయం వేస్తుంది. ఆ భయం కూడా అహంకారానికే. అహంకారానికి ఏదో ఒక శరీరం ఉండాలి. ఈ శరీరాన్ని స్మశానానికి తీసుకువెళ్ళి దహనం చెయ్యకముందే అంటే శరీరం కాలి బూడిద అవ్వకముందే వాడిలో ఉన్న అహంకారం కాలి బూడిద అయిపోతే వాడు మాత్రమే జ్ఞాని అవుతాడు. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. నేను ప్రతీ ఆదివారం చెపుతున్నాను. మీకు చావు గొడవ వద్దు. మీరు ఈ లోకంలో ఉండాలి. మీరు ఈ లోకంలో ఈ దేహంలో ఉండగా మీలో ఉన్న అహంకారం మరణిస్తే మీరు జ్ఞాని అవుతారు. ఈ దేహం మరణించిన తరువాత ఇంకేమి అవ్వటానికి అవకాశం లేదు. మీకు ఇంకో శరీరం రావలసిందే. అంటే ఈ దేహంలో ఉండగానే, ఈ లోకంలో ఉండగానే మీలో ఉన్న అహంకారం మరణించాలి. అప్పుడు మీరు జ్ఞానులు అవుతారు.

మీరు చేసే సాధన కంటే గురువు అనుగ్రహం చాలా బలంగా పనిచేస్తుంది. మీ గురువు ఎవరయినా అయ్యి ఉండవచ్చు. జ్ఞానం అనేది రమణమహర్షో, రామకృష్ణ పరమహంసో, రాముడో వాళ్ళ సొంత ఆస్తి మటుకు కాదు. మీకు సాధన కొంత వరకు అవసరం. అయితే గురువు అనుగ్రహం వలననే మీరు ఎక్కువ లాభాన్ని పొందగలుగుతారు. ఈ ఆదివారం సమావేశాలలో నేను చెప్పే ముఖ్యమైనది ఏమిటి అంటే ఈ ఆధ్యాత్మిక సాధనల పేరుమీద మన సత్సంగాలలో మటుకు ఎవరూ బరువులు మొయ్యవద్దు. సాధన పేరుమీద కాని, ఇంకో పేరు మీద కాని ఎవరూ బరువు మోయవద్దు, బరువు దించుకోండి. ఆదివారం సమావేశాలలో మీకు బరువు ఎత్తి పంపుదామని నా ఉద్దేశ్యంకాదు. మీకు ఉన్న బరువును దించాలని నా ఉద్దేశ్యం. చదువు అంటే ఎలా ఉంటుందో తెలియని వాళ్ళ దగ్గర నుండి చదువు ఆశించకూడదు, గౌరవం ఎలా చెయ్యాలో తెలియని వాళ్ళ దగ్గరనుండి గౌరవం ఆశించకూడదు. వాళ్ళకే తెలియనప్పుడు వాళ్ళ దగ్గర ఆశించటం మనదే పొరపాటు. అలాగే ఆత్మవిద్య గురించి ఏమీ తెలియని వాళ్ళదగ్గర నుండి ఆత్మవిద్య ఆశించటం కూడా అటువంటిదే. ఎవరితోనూ ఎక్కువగా చర్చించవద్దు. విషయాన్ని ఊరికే చర్చించకూడదు.

చిన్న గుంట ఉంది అనుకోండి. అందులో మీరు రాయి వేస్తే కింద ఉన్న మట్టి అంతా పైకి వస్తుంది. పైన ఉన్న తేటనీరు కూడా మురికి అయిపోతుంది. చర్చలవల్ల ఒకోసారి ఇటువంటి ప్రమాదాలు వస్తాయి.

ఇప్పుడు మనలో ఉన్న లోటు ఏమిటి అంటే నువ్వు ఎవరవు, నువ్వు ఎవరవు అని మనం అందరిని అడుగుతాము. ఇలా నువ్వు ఎవరవు అని అడిగేవాడు ఎవడూ కూడా నేను ఎవడను అని వాడిని వాడు ప్రశ్నించుకోవటంలేదు. నువ్వు ఎవడవు అని ప్రశ్నించే బదులు, నేను ఎవడను అని ప్రశ్నించుకొంటే వాడు జ్ఞాని అవుతాడు. నేను ఎవడిని అని తనని తాను ప్రశ్నించుకోవటం వలన వాడికి ఒక విధమైన అన్వేషణ ప్రారంభమౌతుంది. ఇంకో చిన్న విషయం చెపుతున్నాను. మీలో ఎవరయినా మంచి పనులు చేస్తూ ఉండవచ్చు, చెయ్యండి మంచిదే కానీ మంచిపనులు చేసినంతమాత్రం చేత మీకు జ్ఞానం కలుగుతుందని ఎక్కడా లేదు. మాయ దారిఇస్తేనేకాని వాడు జ్ఞాని అవ్వలేడు. మేము చాలా మంచి పనులు చేసాము అయినా మాకు ఎందుకు దారి ఇవ్వటం లేదు అని మాయను బలవంతం చేయటానికి కుదరదు.

ప్రారబ్దం అని, కర్మ అని ఇలా గంటల తరబడి చర్చించినా ఇవన్నీ ప్రకృతిలోనివే. మనందరం చేసే పొరపాటు ఏమిటి అంటే ప్రకృతి గురించి ఆలోచిస్తున్నాము, ప్రకృతిని స్మరిస్తున్నాము, ప్రకృతిని అన్వేషిస్తున్నాము, ప్రకృతిని విచారిస్తున్నాము కాని ఆత్మని విచారిస్తున్నామని అనుకొంటున్నాము. మనం చేసేది అంతా ప్రకృతి గురించే. మీకు మంచి ప్రారబ్దం ఉంటే మంచి, చెడు ప్రారబ్దం ఉంటే చెడ్డ అనుభవిస్తారు. మంచి చేస్తే పుణ్యం, చెడ్డ చేస్తే పాపం వస్తాయి. పుణ్య పాపాలు మీరు ఏమి చేసుకొంటారు. పుణ్యం వలన సుఖం, పాపం వలన దుఃఖం వస్తాయి. అయితే ఆ సుఖమూ అబద్ధమే, దుఃఖమూ అబద్ధమే. ఇది ప్రారబ్దం కింద, కర్మ కింద మీరు చెప్పకోవచ్చు, నేను కాదనటం లేదు. కానీ ఈ సుఖమూ స్వప్నమే, దుఃఖమూ స్వప్నమే. ప్రతీ మనిషి యింద్రియాలతో కొన్ని సుఖాలు అనుభవిస్తాడు. అది అసత్యసుఖం. యింద్రియాలతో అనుభవించే సుఖం అసత్యమైనది కాబట్టి దానిలోనుండి మరల దుఃఖం వస్తుంది. ఆత్మసుఖం ఒక్కటే సత్యమైనది.

ఆత్మ నా హృదయంలో ఉంది. నాలో ఉన్న ఆత్మే మీలో ఉంది మీలో ఉన్న ఆత్మే నాలో ఉంది. ఇందులో ఏమీ తేడా లేదు. అయితే మీలో ఉన్న ఆత్మ మీకు ఎందుకు తెలియటంలేదు. ఈ ప్రశ్న వేసుకోవటం మానేసి మీరు ప్రారబ్దం అని, కర్మ అని, నా పూర్వజన్మ ఏమిటి, ఉత్తర జన్మ ఏమిటి అని ఇటువంటి సమస్యల్లోనికి వెళతారు అనుకోండి, ఇంక మీకు మార్గం కనబడదు. ఎందుచేతనంటే ఈ ప్రారబ్ధం అహంకారానికే, కర్మ అహంకారానికే.

మీరు అహంకారం కాదు కదా! మీరు కానిదాని గురించి ఎంత చర్చించినా అది నిజం ఎలా అవుతుంది. ఇక్కడ గదిలో నా కళ్ళజోడు పడేసుకున్నాను. గదిలో చీకటిగా ఉంది కాబట్టి అది నాకు కనిపించటంలేదు. అదే విధంగా నీలో ఆత్మ ఉంది కానీ అది నీకు కనిపించటంలేదు. నీకు కనిపించనంత మాత్రంచేత నీలోపల ఆత్మ లేదని అనుకోవద్దు. గదిలో చీకటిగా ఉండటం వలన నీ కళ్ళజోడు నీకు కనబడటం లేదు. అలాగే మీలో ఉన్న అజ్ఞానం వలన లోపలఉన్న వస్తువు మీకు తెలియటంలేదు. చీకటిగదిలో దీపం వెలిగించగానే అక్కడ ఉన్న కళ్ళజోడు ఏ విధంగా అయితే నీకు కనిపిస్తుందో అలాగే ఎప్పుడయితే నీకు జ్ఞానం కలిగిందో అప్పుడు మీలో ఉన్న ఆత్మ దాని స్వరూపం మీకు తెలియపరుస్తుంది. చీకటిలోను, మనం దీపం వెలిగించినప్పుడు కూడా కళ్ళజోడు అక్కడ గదిలోనే ఉంది కాని దీపం వెలిగించటం వలన అది మనకు కనిపిస్తోంది. అలాగే మీకు తెలియనప్పుడు, తెలిసినప్పుడు కూడా లోపల ఆత్మ ఉంది. జ్ఞానం అనే దీపం వెలిగించటం వలన లోపల ఉన్న ఆత్మ మీకు తెలియబడుతుంది. మీరు సూటిగా ఆత్మను వెదకటం మానేసి ఈ జన్మల గురించి, మంచి చెడ్డల గురించి, ప్రారబ్ధకర్మల గురించి, పాప పుణ్యాల గురించి ఇలా ఆలోచిస్తూ ఉంటారు అనుకోండి. ఇదంతా మాయలో భాగమే.

మీరు రామాయణం చాలాసార్లు చదివి ఉంటారు. ఆంజనేయస్వామి మహాభక్తుడు. ఆయన హృదయంలో రాముడే ఉండేవాడు. ఎప్పుడూ రామనామం స్మరించేవాడు. ఆయన పనిచేస్తే రాముడి పని తప్పించి ఆయనకు సొంత పని ఏమీ లేదు. అది ఆంజనేయస్వామి యొక్క ప్రత్యేకత. మనం చేతులతోటి మన సొంతపని తప్పించి ఎప్పుడయినా ఎవరికయినా పని చేసామా? మీరు సత్యాన్ని హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నారా? మొదట అది చూసుకోండి. మొదటలోనే తప్పటడుగు వేస్తే దారి తప్పిపోతారు. మీరు ఇక్కడ నర్సాపురం వెళ్ళడానికి బయలు దేరి మార్టేరు వైపు ఎంత స్పీడుగా నడిచినా నర్సాపురం రాదు. మీ ఉద్దేశ్యం నర్సాపురం వెళదామని, నడిచేది మార్టేరువైపు నడుస్తున్నారు. మీరు కష్టపడుతున్నారు, స్పీడుగా నడుస్తున్నారు, మీకు చెమటలు పట్టినా, నర్సాపురం వస్తుందా? రాదు. మార్టేరు వస్తుంది. మీకు ఏమి కన్ఫ్యూజన్ వద్దు. మీరు నిజంగా సత్యాన్ని ప్రేమిస్తూ ఉంటే, ఆత్మే సత్యం కాబట్టి దాని దర్శనం మీకు యిస్తుంది. ఇప్పుడు నాకు కలెక్టర్ పోస్టు వచ్చింది అనుకోండి. తాశిల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, జవాన్లు అందరూ నా మాట వింటారు. మీరు సత్యాన్ని ఎప్పుడయితే హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నారో అప్పుడు మీ యింద్రియాలు, మనస్సు, మీ కర్మ, మీ ప్రారబ్దం అన్నీ దారిలోకి వచ్చేస్తాయి. మీకు పోరాటం వద్దు. సత్యాన్ని హృదయపూర్వకంగా ప్రేమించండి అన్నీ దేనికది దారిలో పడిపోతాయి. మీ మనస్సును, ఇంద్రియాలను, మీ ప్రారబ్ధాన్ని అన్నింటిని లొంగదీసుకొనే శక్తి సత్యానికి ఉంది. వీటికి ఉన్న బలం సత్యానికి లేకపోతే ఇంక మనం సత్యాన్ని ప్రేమించటం

ఎందుకు, దానిని తెలుసుకోవటం ఎందుకు?

మనం సత్యాన్ని ప్రేమిస్తున్నామా లేదా అని మొదట ప్రశ్నించుకోండి. ఈ ప్రశ్నలో నుండే మీకు విజ్ఞానం పుడుతుంది. అది మీరు మరిచిపోకండి. మీరు సత్యాన్ని ప్రేమిస్తూ ఉంటే అన్ని మంచిగుణాలు మీకు వచ్చేస్తాయి. మంచిగుణాలకోసం మీరు ప్రయత్నం చేయనక్కరలేదు. తొమ్మిది మాసాలు నిండిన గర్భిణీ స్త్రీ తన గర్భంలో బిడ్డను ఎంత జాగ్రత్తగా కాపాడుకొంటుందో, ఆధ్యాత్మికంగా సాధన చేసేవారు వారిలోని మంచిగుణాలను అంత జాగ్రత్తగా కాపాడుకోవాలని ఒక శాస్త్రంలో చెప్పాడు. అయితే ప్రతీ మంచిగుణం గురించి మీరు ప్రత్యేకంగా సాధన చెయ్యనక్కరలేదు. ముఖ్యమంత్రి అయినవాడికి వెంటనే కారు తెచ్చిపెడతారు. నాకు కారు కావాలి అని అడగనక్కరలేదు. అదే విధంగా మీరు సత్యాన్ని కనుక హృదయపూర్వకంగా ప్రేమిస్తూ ఉంటే అన్నీవచ్చి మీ పాదాల దగ్గర ఉంటాయి. మీరు సత్యాన్ని తెలుసుకొన్నారా లేదా అక్కడిదాకా వెళ్లవద్దు. అసలు మీరు దానిని ప్రేమిస్తున్నారా? అది నేను అడిగేది. మీరు దానిని ప్రేమించకుండా సత్యాన్వేషణ ఎలా చేయగలరు. ప్రేమిస్తే ప్రయత్నం పుడుతుంది. అనుభవం లేకుండా విషయాలు చెప్పటం వలన ఎక్కువ కన్ఫ్యూజన్ వస్తుంది. చెప్పేవాడికి అనుభవం ఉండాలి. నాకు అనుభవం లేకుండా ఏదో చెప్పేయటం, అది తరువాత పుస్తకం కింద వ్రాయటం, అది ఎవరో పదిమంది చదవటం, అక్కడ నుండి కన్ఫ్యూజన్ రావటం. ఇప్పుడు భగవద్గీత ఉంది అనుకోండి. కృష్ణుడికి, అర్జునుడికి చిరకాల బంధుత్వం ఉంది, పరిచయం ఉంది, కాని యుద్ధంలో చెప్పాడు గీత. అంతకు ముందు ఇంట్లోనే చెప్పవచ్చుకదా. ఎందుకు చెప్పలేదు అంటే దానికి కారణం అతనికి యుద్ధ టైములోనే వైరాగ్యం వచ్చింది. వైరాగ్యం రాకుండా చెపుతాడు అనుకోండి, ఆ బోధ పనిచేయదు. ఈ బంధువులను జనాన్ని అందరిని చంపటం ఇదంతా నాకు అనవసరం. నాకు రాజ్యం అక్కరలేదు, భోగం అక్కరలేదు, ఏమీ అక్కరలేదువయ్యా, నేను అంతా వదిలేస్తున్నాను అంటాడు. ఆ వైరాగ్యాన్ని పురస్కరించుకొని గీత చెప్పాడు కానీ అర్జునుడికి వైరాగ్యం రాకపోతే అక్కడకూడా భగవంతుడు గీత చెప్పడు. వైరాగ్యం లేనప్పుడు బోధ చేసినా అది పని చెయ్యదు.

ఇప్పుడు మనకు భగవంతుడితోటి సంబంధం తక్కువగా ఉంది. ప్రపంచంతో సంబంధం ఎక్కువగా ఉంది. అంటే మనకు ఒక రకమైన ప్రాపంచిక జ్వరం. ముందు మనకు ప్రాపంచిక జ్వరం తగ్గాలి. ప్రాపంచిక జ్వరం తగ్గితేనేకాని విచారణ ప్రారంభంకాదు. ఇప్పుడు మీకు లోకం ఎక్కువగా జ్ఞాపకం వస్తోందా, భగవంతుడు ఎక్కువగా జ్ఞాపకం వస్తున్నాడా? అబద్ధం లేకుండా చెప్పండి. మీకు లోకమే ఎక్కువ జ్ఞాపకం వస్తోంది. మీరు లోకానికి దగ్గరగా ఉన్నారు కాబట్టి లోకం ఎక్కువగా జ్ఞాపకం వస్తోంది. మీరు

నిజంగా ఈశ్వరుడికి దగ్గరగా ఉంటే మీకు ఈశ్వరుడే ఎక్కువ జ్ఞాపకం వస్తాడు కదా. అంటే మనం ఈశ్వరుడికి దూరంగా ఉన్నాము. లోకానికి దగ్గరగా ఉన్నాము అని తెలుస్తోంది కదా. నాకు విపరీతమైన ఆకలిగా ఉన్నప్పుడు అన్నం మీదకు వెళుతుంది కాని మైసూర్‌పాక్ గురించి, కాని, పాలబిళ్ళలు గురించిగాని నా మనస్సు ఆలోచించదు. నాకు తినటానికి అన్నం ఉండి, ఇతర భోగాలు ఉన్నప్పుడు అప్పుడు వాటిమీదకు వెళుతుంది. అసలు మీకు ఏది అవసరమో మీకు తెలుసునా? ఎప్పుడు అయినా దాని గురించి ఆలోచిస్తున్నారా? ఇప్పుడు అసలు అర్జెంట్ నీడ్ ఏది? మన దేశానికి ఇప్పుడు భక్తి కంటే హేతువాదం ముఖ్యం అని నాకు ఒకోసారి అనిపిస్తోంది. అంటే మైసూర్‌పాక్ వద్దని కాదు నేను చెప్పేది. ముందు అన్నం ఉండాలి కదా. మీరు స్వతంత్రంగా ఆలోచించాలని ఈ ఆదివారం సమావేశం లక్ష్యం కాని మిమ్మల్ని అందరినీ బానిసలు చెయ్యాలని కాదు. భక్తి పేరు చెప్పి తెలివితేటలు పెంచుకొంటారా లేకపోతే మూర్ఖత్వం పెంచుకొంటారా? ఇప్పుడు మీకు తెలివితేటలు అవసరం. ఒకవేళ మీ తెలివితేటలు అభివృద్ధి అవ్వటానికి హేతువాదం అవసరం అయితే మీరు ఎందుకు ఉపయోగించుకోరు. ఒకవేళ ఈ జన్మలో మీరు సబ్జక్టు వదిలేసి పారిపోతారు అనుకోండి, తరువాత జ న్మలలో కూడా అలాగే పారిపోతారు అనుకోండి, ఇలా ఎన్ని జన్మలు పారిపోయినా మరల ఇక్కడకు ఆత్మ దగ్గరకు రావలసిందే. పారిపోతే పారిపోండి అది మీ ఇష్టం. ఆదివారం సమావేశాలకు ఎవరూ రాకండి. ఎక్కడికి పారిపోతారు మీరు, ఎన్ని జన్మలు పారిపోతారు? ఒక అబద్ధంలోనుండి ఇంకో అబద్ధం లోనికి, మరల ఇంకో అబద్ధంలోనికి ఇలా ఎంతకాలం పారిపోతారు. మీకు నిజం కావాలి అంటే ఆత్మ దగ్గరకు రావలసిందే.

మిమ్మల్ని ఎవరయినా ఎక్కువగా విమర్శిస్తున్నారు అనుకోండి దానికి అసూయ కారణం, నాలో అసలు అసూయ లేదు అనుకోండి. అసలు నాకు విమర్శ పుట్టదు. అసలు మీకు ఎవరిమీద అసూయలేదు అనుకోండి, వాళ్ళు మీకు జ్ఞాపకమే రారు, ఇంక వాళ్ళని విమర్శించవలసిన పని ఏమిటి? నీవు ఎదుటి మనిషిని విమర్శిస్తున్నావు అంటే నాలో ఉన్న అసూయ వలన ఇలా విమర్శిస్తున్నాను అన్న సంగతి కనీసం నీకు తెలుస్తోందా? నాలో ఉన్న రోగం ఏమిటో నాకు తెలియాలి కదా. నాకు తెలియకుండా నా రోగాన్ని ఎలా తొలగించుకోవటం. రోగం తెలియాలి కదా. ఈ లోకంలో మనం కోరదగిన వస్తువు ఏముంది? ఈ లోకానికి సంబంధించిన విద్యలన్నీ కూడా పొట్ట వరకు ఉపయోగపడతాయి కాని సమూహంలో చూస్తే పొయ్యిలో పెట్టిన కట్టెలు లాంటివి, పరిణామంలో అంతే. మేము పూజ చేస్తున్నాము, జపం చేస్తున్నాము అంటారు. మీరు చెయ్యండి నేను వద్దు అనటంలేదు. అసలు పూజ, జపం, ధ్యానం ఎందుకు చేస్తున్నారో మీకు తెలియాలి కదా. మనం ఇటువంటి దేహాలలో

యింద్రియాలతోటి ఎన్నో భోగాలు అనుభవిస్తూ వస్తున్నాము. ఏ యింద్రియానికి ఆ భోగమే కావాలి. నాలుకకు తీపికావాలి, కంటికి సినిమా కావాలి. పొట్ట అజీర్తితో బాధపడుతోంది అని నాలుకకు చెప్పినా దాని గొడవ నాకు ఎందుకు నా నోట్లో ఏదో ఒకటి పడేయి అంటుంది. ఎవరి గొడవ వాడిది. మన యింద్రియాలలోనే ఒకదాని కొకటి పేచీలు. జన్మజన్మలనుండి మనం ఇంద్రియాలతో భోగాలు అనుభవిస్తూ అలవాట్లను కూడా తీసుకొస్తున్నాము. మీరు బాగా జ్ఞాపకం ఉంచుకోండి. స్మశానంలో శరీరం కాలి బూడిద అవుతుంది. మీ కళ్లకు సినిమా చూసే అలవాటు ఉంది అనుకోండి. స్మశానంలో మీ శరీరం కాలిపోయినప్పుడు కన్ను కాలిపోతుందికాని సినిమా చూసే అలవాటు మటుకు కాలదు. అది అలాగే ఉంటుంది. మన అలవాట్లే మన సంకెళ్ళు. నా కోరికలే, నా అలవాట్లే, నా బలహీనతలే నాకు శత్రువులు. నిన్న కాక మొన్న ఆదివారం నీకు భక్తి కలిగితే, జన్మజన్మలనుండి పోషించుకొంటూ వస్తున్న ఈ భోగాలు మామాట ఏమిచేసావు పుల్లయ్యా అంటాయి. ఇప్పడు నీకు భక్తి కావాలా? వేషాలు వేయకు, ఎక్కడికి వెళతావు. నా జున్నుముక్క నాకియ్యి, నా సినిమాలు ఏమిటి, నాటకం మాట ఏమిటి అని కత్తులు కటారులు వేసుకుని వచ్చేస్తాయి. ఈ కోరికల వయస్సు కోటి సంవత్సరాలు, నీ భక్తి వయస్సు నిన్న కాక మొన్న ఆదివారం. అంటే 15రోజులు. 50సంవత్సరాల వయస్సు ఉన్నవాడి మీదకు నాలుగు నెలల పిల్లవాడిని దెబ్బలాటకు వెళ్లమంటే ఎలా ఉంటుంది? ఒక కాలుతో తన్నితే అవతల పడతాడు. మన భక్తి అంతే. మన గొడవలు యుగాలనుండి, జన్మజన్మలనుండి అలా లోపల హృదయంలో పేరుకొని వస్తున్నాయి. నీకు ఇప్పడు భక్తి కావలిసి వచ్చిందా, దేవుడు కావలసి వచ్చాడా? మరి మా మాట ఏమిటి అని లోపల నుండి ఒక్కసారిగా విజృంభించి మీద పడతాయి. అప్పడు ఏమి చెయ్యాలి అంటే మీకు దేవుడిని తెలుసుకోవాలనే వాసన ఉంది కదా. దానిని పెద్ద చేసి పోషించుకోవటం కోసం పూజ, జపం, ధ్యానం చెయ్యమన్నారు.

నాకీ అలవాట్లు ఉన్నాయి అని చెపుతారు. ఆ అలవాట్లే వారిని ముంచేస్తున్నాయి అని వారికి తెలియదు. నాకు ఏ దుర్గుణమూ, నాలో ఏ బలహీనత లేకపోతే మీరందరూ కలిసినా నన్ను ఏమీ చేయలేరు. ఈ దేశమే కాదు, ఈ లోకమే కాదు నన్ను ఎవరూ ఏమీ చేయలేరు. నాలో ఒక్క బలహీనత ఉంటే మీరందరూ కలిసి నాకు ఉపకారం చెయ్యాలన్నా చెయ్యలేరు. కుండ ఎంత పెద్దది అయినా ఒక్క చిల్లు ఉంటే చాలు నీరు బయటకు పోవటానికి, పది చిల్లులు అక్కరలేదు. మీరు ఏ కాలేజీలో చదువుకొన్నా ఏ యూనివర్సిటీలో చదువుకున్నా మీ జీవిత సమస్యలను పరిష్కారం చేసుకోవటానికి ఆ చదువు ఉపయోగపడక పోతే ఆ చదువు చదువేకాదు. పూజ, జపం, ధ్యానం, తపస్సు ఇవి అన్నీఎందుకు పెట్టారు అంటే మీలో ఉన్న అలవాట్లకు బలం ఎక్కువగా ఉంది. అందుచేత మీరు పూజ, జపం,

ధ్యానం చేసుకొని మీరు సద్గుణాలను పెంచుకొని, సద్వాసనలతో మీలో ఉన్న దుర్వాసనలను ఓడించమని వీటిని ఏర్పాటు చేసారు. మీరు సద్వాసనలను పెంచుకొంటే అవి సద్వస్తువును చేరుకోవటానికి దారి చూపిస్తాయి. ధ్యానం అంటే పోరాటం. మీలో ఉన్న మంచి కోరికలకు, చెడ్డకోరికలకు మధ్య జరుగుతున్న సంఘర్షణే ధ్యానం. అది మీ కోసమే మీరు చేసుకొంటున్నారు, దేవుడి కోసం కాదు. మీరు ధ్యానం చేయకపోతే దేవుడికి నష్టమా?

దేవుడిని ప్రేమిస్తున్నాను అని మీరు అంటారు అనుకోండి, మరి ఇంట్లో మా అందరిని చాలాకాలం నుండి ప్రేమిస్తున్నావు, ఇప్పుడు నీకు దేవుడి ప్రేమ కావలసి వచ్చిందా అని కుటుంబ సభ్యులనుండే గొడవ ప్రారంభమౌతుంది మీరు దేవుడిని ప్రేమించినా అబద్ధం, అబద్ధంగా చేయండి. ఎందుచేతనంటే మీరు నిజంగా దేవుడిని ప్రేమిస్తే ఇంట్లో వారు అందరూ మీకు శత్రువులు అవుతారు, ఎందుచేతనంటే మీ మనస్సు, శరీరం, యింద్రియాలు, హృదయం వాళ్ళకు యిచ్చారు. మీ ఇంట్లో వాళ్ళకోసమే మీరు జీవిస్తున్నారు అవసరమైతే వారికోసం మరణించటానికి కూడా మీరు సిద్ధంగా ఉన్నారు. ఎవడయితే నిజంగా ఈశ్వరుడిని ప్రేమిస్తున్నాడో, ఎవడయితే ఆత్మను తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడో వాడికి తన ఇంట్లోవారే మొట్టమొదటి శత్రువులు. ఒకవేళ నేను చెప్పేది అబద్ధం అని మీరు అనుకొంటే నిజంగా మీరు ఈశ్వరుడిని ప్రేమించండి, ప్రేమించి చూడండి, మొట్టమొదట మీ ఇంట్లోనే పోరాటం ప్రారంభమవుతుంది. ధర్మరాజు గొప్పవాడే, ఆయన ఎన్ని మంచి గుణాలు ఉన్నా చివరకు జూదం ఆడాడు. ధర్మరాజుకు మంచిబుద్ధి లేదు అని కాదు, ధర్మరాజు యొక్క బుద్ధికంటే, ఆయన మంచితనం కంటే, ధర్మరాజు మీద ఆయన ప్రారబ్దం ఎక్కువగా పనిచేసింది కాబట్టి జూదం ఆడాడు. ధర్మరాజుకు ఉన్న శక్తి కంటే ప్రారబ్దం యొక్క శక్తి ఎక్కువగా ఉండటం వలన జూదం ఆడాడు. అంటే ప్రారబ్దం యొక్క శక్తి ఎలా ఉంటుందో ఉదాహరణకు చెపుతున్నాను. ధర్మరాజు అంతటి మహాత్ముడే జూదం ఆడాడు అని ఇప్పుడు లోకంలో జూదం ఆడేవాళ్ళంతా ధర్మరాజుతో సమానం అని, మీరు అనుకొని ప్రమాదంలో పడకండి ధర్మరాజు అంతటివాడే ఒక జూదం అనే వ్యసనానికి లొంగిపోతే ఇంక మన మాట ఏమిటి? ఈ మనస్సు ఏమి చేస్తోందో ప్రతి నిమిషం జాగ్రత్తగా ఉండాలి. ప్రతీ గంటా కాదు ప్రతీ నిమిషం కూడా మనం జాగ్రత్తగా ఉండాలి. ఈ మనస్సు ఏమి చేస్తోంది అని ప్రతీక్షణం మీరు పరిశీలన చేసుకొంటూ ఉండాలి. మీ మనస్సును పరిశీలనలో పెట్టండి.

మీ హృదయమే కురుక్షేత్రం. మీలోని చెడ్డకోరికలే కౌరవులు, మీలోని మంచి కోరికలే పాండవులు. మీరు యుద్ధం జరిగిపోయింది అనుకొంటున్నారు. యుద్ధం

అయిపోలేదు ఇంకా జరుగుతోంది, ఇప్పుడు రోజూ మన హృదయంలో జరుగుతోంది. మన హృదయంలో కౌరవులు ఉన్నారు, పాండవులు ఉన్నారు. భగవంతుడిని తెలుసుకోవాలి, జ్ఞానం సంపాదించాలి అని మనకు చిన్న సంకల్పం, చిన్న కోరిక వచ్చింది అనుకోండి, మాట వరసకి ప్రయత్నం మొదలు పెట్టాము అనుకోండి, చెట్టుకు చిగురు రాగానే మేక తినేస్తే ఎలా ఉంటుందో అదే విధంగా మనకు మంచి సంకల్పాలు వచ్చినప్పటికీ దుష్ట సహవాసం కనుక చేస్తే ఈ కాస్త సంకల్పం ఊడిపోతుంది. పెద్దవాడిని, బలమైనవాడిని చంపటానికి కత్తి ఉండాలి, గొడ్డలి ఉండాలి కాని చంటి పిలల్లను చంపటానికి పెద్ద కష్టం ఏమీ లేదు. మన భక్తికి వయస్సు ఎంత ఉంది అంటే పురిటి మంచంలో ఉన్న బిడ్డ ఎలా ఉందో మన భక్తి అలా ఉంది. దేవుడిని తెలుసుకోవాలన్న ప్రేమ కూడా అంతవరకు ఉంది అది చంటి బిడ్డలా ఉంది. అందుచేత మనం బహుజాగ్రత్తగా ఉండాలి. నా మాటలను అర్థం చేసుకోండి, నా హృదయాన్ని అర్థం చేసుకోండి అని అప్పుడప్పుడూ మీకు చెపుతున్నాను. అలా ఎందుకు చెపుతున్నాను? నా మాటలను, నా హృదయాన్ని మీరు అర్థం చేసుకొంటే నాకు లాభం లేదు దానివలన మీకు లాభం కలుగుతుంది. నేను చెప్పే మాటలను అర్థం చేసుకొంటే మిమ్మల్ని మీరు తెలుసుకోవటానికి ఆ మాటలు ఉపయోగపడతాయి కాని దానివలన నాకు లాభం ఏమీ లేదు. నన్ను మీరు తెలుసుకుంటే మీరు సుఖపడరు. మిమ్మల్ని మీరు తెలుసుకొంటే మీరు సుఖపడతారు. ఆత్మ అంటే ఏమీలేదు ప్రేమే. గాడ్ ఈజ్ లవ్ అని చెప్పటం కంటే లవ్ ఈజ్ గాడ్ అని చెప్పటం మంచిది. అలాగే దేవుడు సత్యం అని చెప్పటం కంటే సత్యమే దేవుడు అని చెప్పటం మంచిది. సత్యాన్ని మించిన దేవుడు లేడు. సత్యాన్ని మించిన మతం లేదు, సత్యాన్ని మించిన ఋషి లేడు. ప్రతీ మనిషీ తనను తాను వంచన చేసుకొంటున్నాడు. ఈ మధ్య ఎర్రబట్టలు కట్టుకొని నాకు ఏమి వాంఛలు లేవు, కోరికలు లేవు అంటున్నారు. అది మోసం. వాడిని వాడు మోసం చేసుకొంటున్నాడు. అది నిజం అని మీరు అనుకోవద్దు. మీ సొంతబుద్ధిని ఏం చేస్తున్నారు. ఎర్రబట్టలు కడితే లోపల కోరికలు పోతాయా? భగవంతుడు మీకు బుద్ధిని ఇచ్చాడు కదా, ఎందుకు మీరు ఆలోచించటం లేదు.

మీరు ఆత్మగా ఉండటానికి ప్రయత్నం చేయండి. ఆత్మను ఊహించటానికి ప్రయత్నం చేయవద్దు. మీ ఆలోచనలు కాని, తలంపులు కాని ఆత్మను సమీపించలేవు. అందుచేత ఆత్మను ఊహించటానికి ప్రయత్నం చేయకండి. ఎంత పొడుగాటి బ్యాటరీలైటు అయినా సూర్యుడి వెలుతురు ముందు బహు తక్కువే. సూర్యుడి ముందు బ్యాటరీలైట్‌లు, దీపాలు ఎంతో అహంకారానికి ఉన్న తెలివితేటలు కూడా అంతే. మీ తెలివితేటలు అనే బ్యాటరీలైటుతో భగవంతుడిని కొలవటానికి చూడకండి. అనుకరణవద్దు. మీరు స్వతంత్రంగా ఉండండి.

భయపడి ఏపని చేయవద్దు. మీకు ఏది కావాలో, ఏది అవసరమో మీకు తెలియటానికి ముందే ఈశ్వరుడికి తెలుసు. నన్ను అంగబలం తోటి, అర్థబలం తోటి అలంకరించు, లేకపోతే నన్ను కీర్తితో అలంకరించు అని ప్రతీవాడు ఈశ్వరుడిని అడిగేవాడే కాని నన్ను జ్ఞానంతో అలంకరించు అని అడిగే భక్తుడు మీకు ఎక్కడయినా కనిపిస్తాడా? మీరు నిజమైన భక్తులు కనుక అయితే హేతువాదానికి ఏమీ భయపడనక్కరలేదు. మాకు అన్నీ మంచిగుణాలే, మేము మంచివారము అని కొంతమంది అనుకొంటూ ఉంటారు. ఒక అణా మంచిగుణాలు ఉంటే, అర్థరూపాయి గర్వం తెచ్చుకొంటున్నారు. ఈ గోడకు మంచిఅలవాట్లు ఉన్నాయి. చెడ్డ అలవాట్లు లేవు అయితే ఈ గోడకు మోక్షం వచ్చేస్తుందా? మీకు అసలు లోపల వేదన ఏది, మీ హృదయంలో స్ట్రగుల్ ఏది?

ప్రతీ ఆదివారం చెపుతున్నాను కదా. మీ హృదయంలో నుండి వచ్చిన ఒక్క వాక్యం నాకు కనబడలేదు, ఈ రోజుకు ఒక్క వాక్యం నేను వినలేకపోయాను. అసలు ఏదో ఒక దీపం వెలుగుతూ ఉంటే, ఆ దీపం దగ్గరకు వెళ్ళి మనం పది దీపాలు వెలిగించుకోవచ్చును. ఏదీ అసలు ఒక దీపమైనా వెలుగుతూ ఉండాలి కదా. ఈ ఆదివారం సమావేశాలలో దేవుడు, వైకుంఠం, కైలాసం, మోక్షం ఆ మాటలు అలా ఉంచండి. ఎవరయినా ఒక్కరు నన్ను అర్థం చేసుకొనేవారు ఉంటే నాకు ఏనుగుమీద కూర్చొన్నట్లు ఉంటుంది. నేను చాలా గొప్పవాడిని అని మీరు చెపుతారు అనుకోండి. దానివలన నాకు కలిసి వచ్చేది లేదు, మీకు కలిసి వచ్చేది లేదు. ఎప్పడు నేను సంతోషిస్తాను అంటే నేను చెప్పే మాటల్ని ఏ స్పిరిట్‌తో అయితే నా హృదయంలో నుండి ఆ మాటలను చెపుతున్నానో అదే స్పిరిట్‌తో ఆ మాటలను మీరు అర్థం చేసుకొని, మీరు అనుభవించగలిగితే అప్పడు మీరు నన్ను గౌరవించినట్లు. మీ ఓట్లు నేను ఆశించటం లేదు, మీ నోట్లు నేను ఆశించటం లేదు, అర్థం చేసుకొనే మీ హృదయాన్ని నేను ఆశిస్తున్నాను.

అన్నం తినేటప్పడు ఇది సాధన అని అనుకోము, స్నానం చేసేటప్పడు ఇది సాధన అని అనుకోము. అవి ఎంత సహజంగా మీరు చేస్తున్నారో, భగవంతుడిని తెలుసుకోవాలనే ప్రయత్నం కూడా అంత సహజంగా ఉండాలని నా హృదయపూర్వకమైన కోరిక. ఎవడయితే నేచురల్‌గా జీవిస్తున్నాడో వాడికి పూజ, జపం, తపంతోటి సంబంధం లేకుండానే జ్ఞానం కలుగుతుంది. పూజలు, జపాలు, తపాలగొడవ వాడికి అక్కరలేదు. ఎవడయితే కృత్రిమంగా జీవిస్తున్నాడో, తన కృత్రిమజీవితానికి దూరం అవ్వటంకోసం వాడికి ప్రయత్నం కావాలి. వాటినే పూజలు, జపాలు, ధ్యానాలు అంటారు. మాకు అంత గౌరవం ఉంది, ఇంత గౌరవం ఉంది అని చాలామంది చెప్పకొంటూ ఉంటారు. ఆ గౌరవం నిలబడేది కాదు. మహాసామ్రాజ్యాలే కాలగర్భంలో ఎగిరిపోయాయి. ఇంక ఈ శరీరం ఎంత, ఈ గౌరవం ఎంత. కృత్రిమంగా

జీవిస్తూ కృత్రిమ గౌరవాల కోసం ఎవరూ ప్రయత్నం చెయ్యకండి. ఇలా కృత్రిమ గౌరవాలకోసం ప్రయత్నం చేస్తే మరల అది పోగొట్టుకోవటానికి మీరు ఎన్నో జన్మలు ఖర్చుపెట్టాలి. ఎవడయితే కృత్రిమజీవితానికి అలవాటు పడ్డాడో, ఎవడయితే కృత్రిమచేష్టలకు, కృత్రిమగౌరవాలకు అలవాటు పడ్డాడో వాడికి జ్ఞానం రాదు. మీ జీవితం సహజంగా ఉంటే, మీ జీవితం సరళంగా ఉంటే, మీ మనస్సు సహజంగా ఉంటే జ్ఞానం దానంతట అదే వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. ఎందుచేతనంటే అది మీ హృదయంలోనే ఉంది. తట్టండి, తెరువబడుతుంది అన్నాడు ఏసు.

సోదర మహాశయులారా! కాలం ఖర్చు అవుతూ ఉంటే బాధపడుతున్నారు, డబ్బు ఖర్చు అవుతూ ఉంటే బాధపడుతున్నారు, మీ ఇంట్లో ఉన్న వస్తువులు ఏమయినా పోతే బాధ పడుతున్నారు. అయితే మనం జ్ఞానం పొందకుండా ఈ జన్మలు పోతూ ఉంటే మీరేమైనా బాధపడుతున్నారా? బంగారం పోతే, రూపాయలు పోతే మీరు బాధపడుతున్నారు కదా. కానీ మీరు జ్ఞానాన్ని సంపాదించకుండా ఈ శరీరాలే పోతున్నాయి కదా అని మీరు ఏమయినా బాధపడుతున్నారా? మీ ఆభరణాలకంటే మీ రూపాయల కంటే మీరు ఎక్కువ కాదా? మీ గురించి మీరు ఆలోచించుకోరా? మీ తలంపులే మీకు శత్రువులు అన్న సంగతి ఈ నాటికి అయినా మీకు తెలిసిందా. మీ తలంపులే మీరు ఆత్మను తెలుసుకోకుండా మిమ్మల్ని ఆత్మకు దూరం చేస్తున్నాయి అన్న సంగతి ఏ నాటికి మీరు తెలుసుకొంటారు. మా బద్ధిర్రాజుగారు చనిపోయాక ఇప్పుడు నాకు కరువల్లా ప్రేమే కరువుగా ఉంది. నాకు బట్టలకు కరువు లేదు, డబ్బుకు కరువు లేదు, బియ్యం కరువు లేదు. కాని ఇప్పుడు నాకు ప్రేమే కరువు. మా బద్ధిర్రాజుగారు చనిపోయాక ఇప్పుడు నన్ను ప్రేమించేవాళ్ళు ఎవరూ కనిపించటం లేదు. హోమియోపతి డాక్టరు బ్రహ్మాజీగారు, ఇంగ్లీష్ డాక్టర్ రామారావుగారు కలిసి నాకు ఆ కరువు తీరుస్తారని నమ్ముతున్నాను.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-2016, అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేదం అంటే జ్ఞానం అని అర్థం. వేదాలలో ఉన్నసారాన్ని వాల్మీకి రామాయణం కింద తీసుకొనివచ్చాడు. మానవుడి జీవితం ఎలా ఉండాలని వేదంలో నిర్ణయింపబడిందో దానిని రామాయణంలో రాముని కథగా వాల్మీకి చెప్పటం జరిగింది. రామాయణం జరిగిందా లేదా అని చర్చకాదు. అది యిచ్చే మెస్సేజ్ ఏమిటి, దాని వలన మనం నేర్చుకొనేది ఏమిటి అది చూసుకోండి. ఏ గ్రంథం చదివినా మీరు ఒకటి గుర్తు పెట్టుకోండి. ఈ పుస్తకం చదివాము, దాని వలన మనం నేర్చుకొన్నది ఏమిటి అని చూసుకోవాలి. దానిలో మీరు నేర్చుకొనేది ఉంటే